క్లుప్తంగా

ఈఓపీఆర్‌డీకి నిధులు డ్రా చేసే అధికారం

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం పంచాయతీలో పబ్లిక్ వాటర్ స్కీం నిధుల దుర్వినియోగంపై సర్పంచ్‌కు చెక్ పవర్ హోల్డ్‌లో పెట్టిన విషయం ప్రజలకు విదితమే. ప్రస్తుతం సర్పంచ్ చెక్‌పవర్‌ను విత్ హోల్డ్‌లో ఉండగా.. పంచాయతీలో పనులు చేసే నిమిత్తం 14,15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసే అధికారం నిబంధనలు ఈఓపీఆర్‌డీ రఘుబాబుకు అప్పగిస్తూ మంగళవారం సాయంత్రం డీపీఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

మానవ సంబంధాలకే తొలి ప్రాధాన్యం



మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సంద్రా

ఒంగోలు: రోజురోజుకూ అంతరించిపోతున్న మానవ విలువలను పునరుద్ధరించుకోవాలని మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సంద్రా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రైజ్ కాలేజీలో మానవీయ విలువలు అనే అంశంపై మాట్లాడారు. విద్యార్థి దశలో ఎలాంటి సహచరులు ఉండాలి, తల్లిదండ్రులతో ఎలా ప్రవర్తించాలి, వారిని ఎలా ప్రేమగా చూసుకోవాలి, ఉన్నతంగా ఎదగాలంటే ఎలా సాధన చేయాలో వివరించారు. రైజ్ కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక పాల్గొన్నారు.

18 నుంచి శ్రీగిరి పవిత్రోత్సవాలు



శ్రీ గిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం

ఒంగోలు మెట్రో: స్థానిక ఒంగోలు కొండపై వెలసిన శ్రీగిరి వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలను ఆదివారం నుంచి 20వ తేదీ మంగళవారం వరకు నిర్వహించనున్నారు. సహస్ర నామార్చన, పంచాంగ పఠనం, పంచ గవ్యారాధన తదితర కార్యక్రమాలుంటాయని చెప్పారు.

ఆకట్టుకున్న మ్యాజిక్ షో



కార్యక్రమంలో కరెస్పాండెంట్ జిల్లెల్ల వెంకటేశ్వర్లు

ఒంగోలు రూరల్: కరవది శ్రీ వాణి విద్యా నికేతన్ విద్యా సంస్థ ప్రాంగణంలో జానవిజ్ఞాన్ వేదిక ఆధ్వర్యంలో మ్యాజిక్ షో మంగళవారం నిర్వహించారు. శ్రీ వాణి నికేతన్ కరస్పాండెంట్ జిల్లెల్ల వెంకటేశ్వర్లు అధ్యక్షునిగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెజీషియన్ హరి హస్త లాఘవం, దాచిపెట్టే విధానం, ప్రేక్షకులుల మనస్సు తమ వైపు ఉండేలా చూసే అంశాలు గుర్చి వివరాలు తెలిపారు. జానవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, టీచర్ సస్మిత్ కుమార్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న కోటేశ్వరరావు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సీహెచ్ కోటేశ్వరావు స్వాతంత్య్ర సమరయోధుల గురించి రచించిన పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 250 కాపీలను తను సొంత నగదుతో ముద్రించామన్నారు. ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్బంగా పంపిణీ చేస్తామన్నారు. తరువాత 1000 కాపీలను ముద్రించి విద్యార్థులకు, గ్రంథాలయాలకు కూడా పంపిణీ చేస్తామని చెప్పారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

చినగంజాం: రొయ్యల చెరువుల వద్ద సామాను దొంగిలించిన కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్ రమేష్ తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. మండలంలోని రాజుబంగారు పాలెం పరిధిలోని 216 జాతీయ రహదారి పక్కన ఉన్న ఆర్ సూర్యనారాయణ రెడ్డి రొయ్యల చెరువుల వద్ద ఒంగోలుకు చెందిన కందిపాటి వెంకటేష్ అనే వ్యక్తి సోమవారం చెరువుకు సంబంధించిన సామగ్రి దొంగలించాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సూర్యనారాయణ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మంగళవారం ఉదయం వెంకటేష్‌ను అరెస్టు చేశారు. అనంతరం అతన్ని చీరాల కోర్టుకు హాజరు పరచగా కోర్టు అతనికి రిమాండ్ విధించింది.

మొక్కలు పర్యావరణ నేస్తాలు



పాత రిమ్స్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రభుత్వ ఉద్యోగులు



మొక్కలు నాటుతున్న గౌతమ్ అశోక్

ఒంగోలు టౌన్: భవిష్యత్ తరాలు బాగుండాలంటే పర్యావరణ పరిరక్షణ ముఖ్యమని జిల్లా ఉపాధి అధికారి టి. భరద్వాజ అన్నారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వాసుపత్రులు, పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన హరిత ఫౌండేషన్‌ను అభినందించారు. పకృతి సంపద పెంచాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వైఎంఎస్‌పీ గోవిందు అన్నారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి ఎం. రజనీకుమారి, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వి. సుభాషిణి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ యాదవ్, హరిత ప్రకాశం ఫౌండేషన్ అధ్యక్షుడు ఏఎస్ఎం బాషా, పతంజలి యోగ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ రత్నం, బి. కృష్ణ, రమణయ్య, పి. మోహనరావు, కమల్, బి.రవి, జి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఒంగోలు సెంట్రల్: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు 'ఎక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం పురస్కరించుకుని సంతపేటలో బీజేపీ ఉపాధ్యక్షుడు గౌతమ్ అశోక్ మొక్కలు నాటారు. తన తల్లి సుబ్బరత్తమ్మ జ్ఞాపకార్థం మొక్కను ఇంటి యజమానికి దత్తత ఇచ్చారు. పార్టీ ఎస్సీ మోర్చ కార్యవర్గ సభ్యుడు అల్లరి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రీజినల్ స్థాయి బాక్సింగ్ పోటీలు



రీజనల్ స్థాయి విజేతలతో ముఖ్య అతిథి రవికుమార్

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో దక్షిణ భారత స్థాయి బాక్సింగ్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణ, కర్నాటక, కేరళ, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి నవోదయ విద్యార్థులు తమ ప్రతిభా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ వి.రవికుమార్, గౌరవ అతిథులుగా బిబు ప్రసాద్ సాహు, దేవా సింగ్ నాయక్ హాజరయ్యారు. విజేతలకు యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ఒంగోలు నవోదయకు చెందిన సీహెచ్ సంజయ్, ఆర్.వర్షిణి అత్యుత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి బహుమతులు సాధించారు. విజేతలైన 52 మంది విద్యార్థులు సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు హర్యాణాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలను నవోదయ పీఈటీలు ఆర్.పాండురంగారావు, కె.అనంతశ్రీ , బాక్సింగ్ శాప్ కోచ్ వేణు తదితరులు పర్యవేక్షించారు. అభినందన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ సి.శివరాం నిర్వహించారు.

హిందూ ఐక్యత ర్యాలీ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: బంగ్లాదేశ్ లో బలవంతపు అధికార మార్పిడి అనంతరం హిందువులపై, మైనారిటీలపై అక్కడి మెజారిటీ మత మూకలు చేస్తున్న దారుణ ఘటనలు కంట తడి పెట్టిస్తున్నాయని.. వక్తలు పేర్కొన్నారు. హిందూ సమాజాన్ని జాగృతం చేయడానికి బుధవారం నిర్వహిస్తున్న హిందూ ఐక్యత ర్యాలీలో పాల్గొనాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ్ సోమ సుబ్బారావు పిలుపునిచ్చారు. విశ్వ హిందు పరిషత్ కార్యాలయం అయోధ్య భవన్ లో సోమవారం జరిగిన అత్యవసర సమావేశంలో మాట్లాడారు. సాయంత్రం 4:30 గంటలకు స్థానిక అంజయ్య రోడ్డు లోని ఆంధ్రకేసరి కాలేజీ నుంచి బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు. తూనుగుంట మల్లికార్జున్ రావు, ఇనమనమెళ్లూరి సీతారామయ్య, ఈమని బలరామ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో పనితీరు చూపించాలి



సర్పంచ్‌లకు, సెక్రటరీలకు శిక్షణ ఇస్తున్న ఈఓఆర్డీ రవి

నాగులుప్పలపాడు: గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు పరిశుభ్రత నిర్వహించడంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పనితీరు ప్రదర్శించాలని ఈఓఆర్డీ రవి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం రెండో రోజు సర్పంచ్‌లు, సెక్రటరీలకు నిర్వహించిన శిక్షణలో పలు సూచనలు చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ల నిర్వహణ వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. సూపరింటెండెంట్ దక్షిణామూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం



యరజర్లలో ఆర్వో ప్లాంట్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఈఓఆర్డీ తదితరులు

ఒంగోలు రూరల్: పరిసరాల పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఒంగోలు ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. గ్రామ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ, క్లీనింగ్ కార్యక్రమంతో పాటు బ్లీచింగ్, క్లోరినేషన్, కిరోసిన్, ఆయిల్ బాల్స్ వేయాలని ఆదేశాలు జారీ చేశారు. సీజనల్ ఫీవర్, టైఫాయిడ్, జ్వరాలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని హెచ్చరించారు. అనంతరం రూరల్ లోని యరజర్ల గ్రామంలో క్షేత్ర పరిశీలన జరిపారు. తొలుత ఆర్వో ప్లాంట్ సందర్శించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మారెడ్డి రమణమ్మ, రిసోర్స్ పర్సన్ రామ్ మోహన్, సర్పంచ్ రాములమ్మ కార్యదర్శి పాల్గొన్నారు. వైస్సార్ సీపీ నాయకులు తమ్మిశెట్టి శ్రీనివాస్, జాజుల శ్రీనివాస్, ఆంజనేయులు యరజర్ల కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ప్రవీణ్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ

నాగులుప్పలపాడు: మండల పరిషత్ కార్యాలయ అభివృద్ధి అధికారిగా జయమణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా పల్నాడు జిల్లాకు బదిలీపై వెళ్ళిన జయమణిని తిరిగి ఇక్కడకు చేరుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న మహాలక్ష్మి బదిలీపై పల్నాడు జిల్లా వెళ్లారు.

వర్గీకరణ పేరుతో రిజర్వేషన్‌లు ఎత్తివేసే కుట్ర



మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ నాయకులు

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణ పేరుతో రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర జరుగుతోందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చీమకుర్తిలోని వేమా శేషు నివాసంలో ఏర్పాటైన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కార్యాచరణ కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పు ఉందన్నారు. ఏబీసీడీ వర్గీకరణ సైకిలింగ్‌లో ఒకే కులానికి న్యాయం జరిగే విధంగా ఉందన్నారు. బండ్ల డేవిడ్, దాసరి హనుమంతు, గోళ్ళ ప్రతాప్, వేమా చినకోటేశ్వరరావు, పిల్లి కోటేశ్వరరావు, బండ్ల కొండలు, మట్టిగుంట రామాంజి పాల్గొన్నారు.

ముగిసిన పేస్ వర్క్‌షాప్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు డిజైన్ థింకింగ్ అండ్ ప్రాబ్లం సాల్వింగ్‌పై కేఎల్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.వెంకట రమణ అవగాహన కల్పించారు. మంగళవారం జరిగిన ఈవర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతనంగా ఆలోచించడం, ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కోవడం, అవసరమైన తక్షణ నిర్ణయాలు తీసుకోగలగడంపై అవగాహన కల్పించారు. కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఈవర్క్‌షాప్ ద్వారా విద్యార్థుల్లో ఆలోచనాశక్తి, నిర్ణయాత్మక శక్తి మారుతుందన్నారు. కాలేజీ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ జీవీకే మూర్తి, ఎంబీఏ విభాగం అధిపతి టి.మేరీజోన్స్, ఎంబీఏ విభాగ అధిపతి జి.స్మిత పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జాతీయ బాల హక్కుల పరిరక్షణలో భాగంగా కార్మిక శాఖ రూపొందించిన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పోస్టర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం స్థానిక ప్రకాశం భవన్‌లో ఆవిష్కరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉప కార్మిక కమిషనర్ గాయత్రిదేవి, సార్స్ జనరల్ సెక్రటరీ ఆర్.సునీల్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అన్నదానం



పిల్లలకు భోజనాలు, స్నాక్స్ పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

కొత్తపట్నం: మదర్ థెరెస్సా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు కుమార్తె అనిషా లక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా పోకూరి రవీంద్రబాబు సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. దాతల సహకారంతో ఆపన్నులను ఆదుకుంటామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆర్గనైజర్ డి.కేశవ, ఎం.సునీల్, డి.రజిత్, ఎం.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

కొమరోలు: మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లికార్జుననాయుడు తెలిపారు. ఈ నెల 16, 19 తేదీల్లో అల్లినగరం రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని, 20వ తేదీన సూరవారిపల్లి, 21న బాదినేనిపల్లి, 22న క్రిష్ణంపల్లి, 23న మొట్టుపల్లి, 24, 26 తేదీల్లో రెడ్డిచెర్ల, 27, 28 తేదీల్లో ఇడమకల్లు, 29, 30 తేదీల్లో రాజుపాలెం, 31న వెన్నంపల్లె, సెప్టెంబర్ 2న జి.మొరాయిపల్లి, 3న నల్లగుంట్ల, 4న దద్దవాడ, 5న అలసందలపల్లె, 6న పాట్టిపల్లె, 7న అక్కపల్లె, 9న పుల్లారెడ్డిపల్లె, 10న చింతలపల్లె, 11 నుంచి 19వ తేదీ వరకు కొమరోలు, 20, 21న బ్రాహ్మణపల్లె, 24న తాటిచెర్ల, 25న ముత్రాసుపల్లె, 26న హసనాపురం, 27, 28 తేదీల్లో నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఎవరికైనా భూ సమస్యలుంటే సంబంధిత రైతులు రెవెన్యూ సదస్సుల్లో అర్జీల రూపంలో తమ సమస్యలను తెలిపి పరిష్కరించుకోవాలని కోరారు.

నేడు గృహ యజమానులతో సమావేశం

బేస్తవారిపేట: జాతీయ రహదారి 544డీ రోడ్డు విస్తరణలో నివాస గృహాలు, భూములు కోల్పోయిన ప్రజలతో బుధవారం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశం హాలులో మార్కాపురం సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ ఫర్వీన్ తెలిపారు. విస్తరణ పనులు గతంలో పూర్తిస్థాయిలో జరుగకుండా అడ్డుకోవడంపై జేసీ ఆదేశాల మేరకు యజమానులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గృహ, భూములు కోల్పోతున్న యజమానులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం



విద్యార్థినికి గ్రంథాలయ సభ్యత్వాన్ని అందిస్తున్న దోస్తి ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ బాషా

ఒంగోలు టౌన్: పుస్తక పఠనంతో మంచి వ్యక్తిత్వం అలవడుతుందని దోస్తి ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ అన్నారు. ఘర్ ఘర్ తిరంగాలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పీవీఆర్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులచే జాతీయ పతాకాలను ప్రదర్శించారు. 20 మంది విద్యార్థినులకు ఉచితంగా మహబూబ్ గ్రంథాయ సభ్యత్వం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. నేటి డిజిటల్ యుగంలో పుస్తకాలు చదవే అలవాటు తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఎంత మాత్రం మంచిది కాదన్నారు. దీనివల్ల భావి తరాలకు నష్టం వస్తుందని చెప్పారు. పుస్తకాలను చదవితే జ్ఞానం వికసిస్తుందని, మెదడు క్రియాశీలం అవుతుందని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. తమ పిల్లలతో తల్లిదండ్రులు కలిసి వారంలో ఒకరోజు గ్రంథాలయాన్ని సందర్శించాలని సూచించారు. జిల్లా గ్రంథాయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ జాతీయ నాయకులు, విజేతల పుస్తకాలు చదివి స్ఫూర్తి పొందాలని చెప్పారు. గ్రంథాయ సభ్యత్వాన్ని ఉచితంగా అందించిన దోస్తి ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ బాషాకు గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి. పేరయ్య, విశ్రాంత ప్రిన్సిపాల్ ఐనంపూడి నరసింహం, సామాజిక కార్యకర్త నున్నా ఆంజనేయులు, సిబ్బంది కె. సంపూర్ణమ్మ, సందీప్ పాల్గొన్నారు.

ఫార్మసీలో కూడా ఏఐ సేవలు



మాట్లాడుతున్న ఐపీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర రెడ్డి

ఒంగోలు: ఫార్మసీ ప్రాక్టీస్ విభాగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర అనివార్యం అని ఇండియన్ ఫార్మసీ గ్రేడియట్ అసోసియేషన్ (ఐపీజీఏ) రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం క్విస్ ఫార్మసీ కాలేజీలో నిర్వహించిన ఫార్మసీ ప్రాక్టీస్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో మాట్లాడారు. గత 50 ఏళ్లుగా ప్రపంచ ఆరోగ్య రంగం సాధించిన ప్రగతి గురించి వివరించారు. అధునాతన సాంకేతికతతో పాటు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కూడా నేడు అనివార్యం ఎలా అవుతుందనే అంశాన్ని ఉదహరించారు. సరైన రోగ నిర్ధారణ మొదలుకుని పేషెంట్ మెడికల్ హిస్టరీకి సంబంధించినటువంటి కచ్చితమైన డయాగ్నసిస్, మందుల వినియోగం, రిహాబిలిటీ వంటి వాటికి ఉపయోగ పడుతుందని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మేదరమెట్ల కిషోర్‌బాబు మాట్లాడుతూ ఔషధాల వల్ల వచ్చే దుష్పరిణామాలకు అడ్వాన్స్‌డ్ రియాక్షన్లను అంచనా వేసుకుంటూ రోగి ఆధారిత వైద్య విధానాన్ని సరైన నిర్వహణలోకి తేవడానికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగపడుతుందన్నారు. కాలేజీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సూర్య కళ్యాణ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి, ఫార్మ ఫార్మకాలేజీ విభాగం అధిపతి, ఐపీజీఏ మహిళా రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రేవతి పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళా ఉద్యోగులు

- కలెక్టర్‌కు ఏపీ జేఏసీ అమరావతి ఉమెన్ వింగ్ వినతి

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి ప్రకాశం ఉమెన్ వింగ్ సభ్యులు మంగళశారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళా ఉద్యోగులు ఫిర్యాదులు చేసేందుకు షీ బాక్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మహిళా విభాగం చైర్‌పర్సన్ జయలక్ష్మి, సెక్రటరీ శ్రీదేవి, కార్యవర్గ సభ్యులు, కలెక్టరేట్ అధ్యక్షుడు ఊతకోలు శ్రీను ఉన్నారు.

నాటి త్యాగాలు ఆదర్శనీయం



ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్, గ్రామస్తులు

నాగులుప్పలపాడు: స్వాతంత్య్ర భారత దేశ త్యాగాలు అందరికీ తెలియజేయాలని.. జాతీయ జెండా భావన గురించి ప్రచారం చేయాలని బీజేపీ యువ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎల్. టీగ్రా అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ వద్ద జాతీయ జెండా ర్యాలీని సర్పంచ్ దేవరకొండ జయమ్మ ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పొగాకు బోర్డు సభ్యుడు పొద వరప్రసాద్, కాట్రగడ్డ చంద్రబాబు, పెంట్యాల శ్రీను, పెంట్యాల సుబ్బారావు, ఇమ్మిశెట్టి నరేంద్ర, రాయపూడి సురేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సరస్వతి, ఆక్స్‌ఫర్డ్ పాఠశాలల ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ఫిట్‌నెస్‌లేని స్కూల్ బస్‌లతో ప్రమాదం

ఒంగోలు టౌన్: జిల్లాలో నిబంధనలను పాటించకుండా ఇష్టారీతిన స్కూలు బస్సులను నడుపుతున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. నిబంధనలను పాటించని కారణం వలన తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థిలను ఎక్కిస్తున్నారని, లైసెన్స్.. అనుభవంలేని డ్రైవర్లు బస్సులను నడుపుతున్నారని తెలిపారు. బస్సులో హెల్పర్ ఉండాలన్న నిబంధనను లెక్క చేయకుండా వ్యవహరిస్తున్నారని, ఫిట్నెస్‌లేని బస్సులను నడుపుతూ చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు.